# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలియజేశారు.
- ❖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఈరోజు విడుదల చేశారు.
- ❖ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో అన్ని నీటి ప్రాజెక్టులు నిండుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ దేశంలో ఏడు జ్యోతిర్లింగాల ప్రముఖ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేలా మరో భారత్ గౌరవ్ పర్యాటక రైలును రైల్వే శాఖ ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఆగస్టు 15వ తేదీన వంద అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈరోజు మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ దృశ్యమాధ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ల ఏర్పాటు, డ్రైన్‌లలో పూడిక తొలగింపుపై కమిషనర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 మున్సిపాలిటీల్లో వంద క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని... రాబోయే వారం రోజులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్లకు సూచించారు. అదేవిదంగా డ్రైన్‌లలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, డైరెక్టర్ హరి నారాయణన్, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఈరోజు విడుదల చేశారు. నామినేషన్ల ప్రక్రియ ఈరోజు నుంచే మొదలైందని, ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్.పి.టి.సిలు, ఎం.పి.టి.సిలు, మునిసిపాలిటీ

సభ్యులు ఓటర్లుగా ఉంటారని, మొత్తం ఓటర్లు 838 మంది కాగా వీరిలో 479 మంది పురుషులు, 359 మంది మహిళా ఓటర్లు వున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవిన్యూ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈనెల 14వ తేదీన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరగనుండగా, ఆగస్టు 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఆగస్టు 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని, సెప్టెంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో అన్ని నీటి ప్రాజెక్టులు నిండుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్నడూ లేనంతగా అన్ని ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటి మట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈరోజు అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ముందుగా రిజర్వాయర్లు, చెరువులు, నీటి కుంటలను నింపుతున్నామని అన్నారు. కాలువల్లో పూడికలు తీసి మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 'రాయలసీమకు సాగు, తాగు నీరు అందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ... భారతీయ సంస్కృతిని తెలియజేసేలా రైల్వేశాఖ మరో “భారత్ గౌరవ్ పర్యాటక రైలు”ను ప్రారంభించింది. ఈ రైలులో ప్రయాణించి ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు ఉజ్జయిని, ద్వారకా, సోమనాథ్, పూణే, నాసిక్ ఔరంగాబాద్ వంటి ఏడు జ్యోతిర్లింగాల, ప్రముఖ పుణ్య క్షేత్రాలను దర్శించుకోవచ్చని IRCTC జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య తెలిపారు. విజయవాడలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కిశోర్ సత్య మాట్లాడుతూ.... విజయవాడలో ప్రారంభమైన ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్ మీదగా ఉజ్జయిని చేరుకుంటుందన్నారు. ఈ యాత్ర 12 రోజుల వరకు కొనసాగుతుందని, ప్రయాణికులకు ప్రయాణ బీమా సౌకర్యం కూడా ఉంటుందని తెలియజేశారు. ఐఆర్‌సీటీసీ టూరిజం బడ్జెట్ ధరలో భారత్ గౌరవ్ పర్యాటక రైలులో తక్కువ ధరకే ఏడు జ్యోతిర్లింగాల ప్రముఖ పుణ్య క్షేత్రాల యాత్ర చేసి రావచ్చన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాలతో దృశ్య మాధ్యమ విధానంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై వారితో చర్చించామని ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించేందుకు స్థానిక భాగస్వాముల సహకారంతో ఈ అకాడమీ ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం ఐ.టి.డి.ఎ. పరిధిలో గల ప్రాధమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ప్రోజెక్టు అధికారి ఎస్.సేధు మాధవన్ తెలిపారు. ఐ.టి.డి.ఎ. గిరిమిత్ర సమావేశ మందిరంలో ప్రోజెక్టు అధికారి పర్యవేక్షణలో అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 76 మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. బదిలీ అయిన స్థానాలలో వెంటనే విధుల్లో చేరాలని, ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రోజెక్టు అధికారి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం తరుపున అన్ని రకాల ప్రోత్సాహాన్ని అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలలోపు భూమి గల రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 55 శాతం రాయితీపై స్ప్రింక్లర్ పరికరాలు, 5 ఎకరాల పైబడి భూమి గల రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, 45 శాతం రాయితీ పై స్ప్రింక్లర్ పరికరాలు సరఫరా చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బోరు బావి ఉన్న రైతులు తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు, అధిక నికర ఆదాయం సాధించడానికి సూక్ష్మ సేద్యం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బిందు, సూక్ష్మ సేద్యం చేయదలచిన జిల్లా రైతులు ఆధార్, సాగు భూమికి సంబంధించి 1B, బ్యాంకు పాసు బుక్ ప్రతులు, ఫోన్ నెంబర్ తదితర వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను లేదా ఉద్యాన అధికారిని గానీ కలిసి నమోదు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కాన్పు అయిన గంటలోపే తల్లి పాలు బిడ్డకు తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎటువంటి అంటూ వ్యాధులు రాకుండా ఉంటాయని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి అన్నారు. అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ... ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ.బి.దేవి మాట్లాడుతూ... బిడ్డ పుట్టినప్పటి నుండి 6 నెలలు వరకు కేవలం తల్లిపాలే తాగించాలని, ఆరు నెలల తర్వాత రెండు సంవత్సరాలు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని, దీనివల్ల ఇద్దరూ ఆరోగ్యంగా వుంటారని వివరిస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆక్వా ఎగుమతులు 70 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతున్నాయని ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఆక్వా రైతులను ప్రోత్సహించాలని తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయులు కోరారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తెలియజేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని.. ఈ ప్రతులను లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ అందజేస్తామని అన్నారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం చేయూత ఇచ్చి ఆదుకోవాలని ఈరోజు లోక్‌సభలో కోరారు. అదేవిధంగా రైతులు, చేనేత కార్మికులను మరింత తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

మొక్కల పెంపకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి విజ్ఞప్తి చేసారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ప్రతీ ఒక్కరు పుట్టిన రోజు, పెళ్లి రోజు, పండుగ రోజులలో ఇళ్ల వద్ద, పంట పొలాల్లో మొక్కలు నాటి, వాటిని పెంచాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు దృష్టి సారించాలని నాటిన ప్రతీ మొక్కను పసిపిల్లలా కాపాడుకోవాలన్నారు. చెట్లను పెంచడం ద్వారా పుష్కలంగా ప్రాణ వాయువు లభించడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పేర్కొన్నారు. అధికారులు మొక్కల సంరక్షణపై సమావేశం నిర్వహించి, మొక్కల పెంపకానికి కావలసిన తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతిని మనం కాపాడితే.. అది మన భవిష్యత్ తరాలను కాపాడుతుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =